# నే నెవణ్ణి

సాయంకాలం అయిదు గంటలదాకా పని చేసి అలసి ఉంది ప్రాణి. ఆత్మారాముడు ఆహారం కోసం, విశ్రాంతి కోసం, ముఖ్యంగా నిద్రకోసం ఆరాటపడుతున్నాడు.

ఒక రోజుకు, మరొక రోజుకు ఆవగింత అయినా భేదం లేకుండా నిత్యమూ ఒకేరకమైన పని చేస్తూ ఉండే నా బోటి మానవుడికి సాయంకాలం కాగానే కేవలం నిద్రమీదనే ధ్యానమంతా లగ్నమై ఉంటుంది.

ఇంతకు ఆ రోజు జరిగిన సంఘటనకు, నా నిద్రకు ఎలాంటి సంబంధమూ లేదు.

అయినవరంలో ఉన్న మిత్రుని వద్దనుంచి ఏమైనా మంచి పుస్తకం తీసుకు వెళ్ళవచ్చుననే ఆశాభావం, నిస్సారంగా ఉన్న నా నరాలలో కొంత ఉత్సాహం పోసింది.

ఈ అయినవరం ఎక్కడిదని ఎవరైనా ప్రశ్నించవచ్చు- దీనికి ప్రపంచలో ప్రఖ్యాతి లేకపోయినా, మద్రాసులో పని చేసేవారు నివసించడానికి అనువైన ప్రదేశం మాత్రం అవును. ఇది మద్రాసు - తిరువళ్ళూరు రైలు మార్గం మీద ఉన్న విల్లివాకమ్ స్టేషన్‌కు దాదాపు ఒక మైలుదూరంలో ఉంది. మద్రాసు నుండి విల్లివాకమ్ పోయే బస్సులు అయినవరం మీదుగానే వెడతాయి. అయినవరంగురించిన ప్రస్తావన ఇంతటితో సరిపెట్టడం ఉచితం.

బస్సుమీద అయినపరం చేరుకుని, మిత్రునిగృహంలో కొంతసేపు గడిపాను. పల్లెటూరి వాతావరణంలో గడియారం అపశ్రుతి కల్పిస్తుంది. తీరా ఎనిమిదిన్నర గంటలు దాటిన తరువాత కాని బయలుదేరాలనే వెప్ప పుట్టింది కాదు. ఆయన వద్ద సెలవు తీసుకుని, ఆయన ఇచ్చిన పుస్తకాలు భద్రంగా చంక పెట్టుకుని బయలుదేరాను.

తిరిగి విల్లివాకమ్ పోయే బస్‌మీద ఊరుచేరుకుని, అక్కడి నుంచి కాలినడకనే స్టేషన్‌కు వెళ్ళాను.

వెన్నెల పుచ్చపువ్వల్లా వుంది. స్టేషన్ ప్రాంగణంలో పోలీసులారీ ఒకటి వుంది. దానిలో కూర్చున్న వ్యక్తుల ఆకారాలు బయటికి అస్పష్టంగా గోచరిస్తున్నాయి.

స్టేషన్‌లో ప్రవేశించేసరికి తొమ్మిది దాటింది. ఎనిమిది గంటల పది నిమిషాలకు సెంట్రల్‌లో బయలుదేరే లోకల్ బండి అప్పుడే విల్లివాకమ్ విడిచి వెళ్ళింది. ఇక తొమ్మిది గంటల యాభై నిమిషాలకు విల్లివాకమ్ చేరుకునే బెంగుళూరు పాసెంజరు తప్ప అంబత్తూరు చేరుకొనడానకి నాకు మార్గాంతరం లేదు. అంబత్తూరు ఆవడికి ఈవలి స్టేషన్. అక్కడే నా నివాసం.

మూడవతరగతి ప్రయాణీకుల సౌకర్యార్థం రైల్వే వారు అమర్చి ఉంచిన బెంచీ మీద శరీరాన్ని చేరవేసి, ఆలోచనలో పడ్డాను.

కడుపులో ఆకలి, తినడానికైతే స్టేషన్‌లో ఏమీ దొరకదు. నన్ను చూస్తూనే స్టేషన్ దుకాణదారుడు తలు

పులు మూసే ప్రయత్నంలో పడ్డాడు. ఇక ఆలోచించడం కన్న చేయదగిన, చేయగలిగిన పని మరొకటి లేదు.

స్టేషన్‌లో జనసంచారం తక్కువగా ఉంది. చల్లని గాలి వీస్తోంది. తెలియకుండానే మెదడును నిద్ర అవహిస్తోంది.

స్టేషన్ ద్వారానికి అభిముఖంగా ఉన్న బల్ల చివర కూర్చుని ఉన్నాను. మరి కొలదిసేపటికే ఇరువురు వ్యక్తులు లోపలికి వచ్చారు. నేను కూర్చున్న బల్లమీదనే నాకు కొంచెం దూరంగా ఒక వక్తి, నాకు ఎదురుగా వున్న బల్ల మీద రెండవ వ్యక్తి కూర్చున్నారు.

ఎదురుగా కూర్చున్న వ్యక్తి ఒక్క నిమిషం తటపటాయించి, కొంచెం ముందుకు వంగి "ఏమండీ! మీరు తెలుగు వాళ్ళలా వున్నారే!" అన్నాడు.

నేను తెలుగువాణ్ణి. తెలుగువాడిలా వుండక మరొక విధంగా ఎలా వుంటాను? నవ్వు వచ్చింది.

"అవును, నేను ఆంధ్రుణ్ణే!" అన్నాను.

"నేను అలాగే అనుకున్నాను లెండి!" అన్నాడు ఆ వ్యక్తి మూర్ఖంగా.

ఇతరుల మూర్ఖత్వాన్ని కూడా సహిస్తూ, సోది చెబుతూ కాలం గడిపే స్థితిలో ఇప్పుడు లేకపోవడంచేత కొంచెం చిరాకు కలిగింది. అయినా, ఆ వ్యక్తి మొదటి ప్రశ్నకు గమ్యస్థానం ఏమై ఉంటుందో తెలుసుకోవాలనే కుతూహలం కూడా రవంత కలిగింది.

నీరసంగా చిరునవ్వు నవ్వి ఊరుకున్నాను.

ఆ వ్యక్తి ముఖంలో కొంత ఆసక్తి పొడచూపింది.

"మీది ఏ జిల్లా అండీ?" అని ప్రశ్నించాడు.

ఆంధ్రుణ్ణి అయిన తరువాత ఒక జిల్లాకు చెంది ఉండడముకూడా తప్పదు. దానిపేరు చెప్పడానికి అభ్యంతరమూ లేదు.

"తూర్పు గోదావరి"

"ఏం ఇలా వచ్చారు?" అని తరువాతి ప్రశ్న.

జాతి, జిల్లా తెలుసుకోవడం ముగిసింది. తూర్పు గోదావరికి చెందినవాడు మద్రాసుకు సమీపంగా ఉండవలసిన అవసరం ఏమిటి? ఏదో ఒక విశేషం ఉండాలి. దానిని తెలుసుకొనడానికి ప్రయత్నించడం సహజం. ప్రయత్నించకుండా ఉండడం మానవప్రకృతికే విరుద్ధం. అందుచేత అతని దృష్ట్యా అది చాల సబబైన ప్రశ్న కావచ్చు.

కాని, రోజంతా నడివంచి పనిచేసి అలసివున్న నాకు మాత్రం ఆ ప్రశ్న పూర్తిగా చిరాకు పుట్టించింది. ఇది ఇతరుల వ్యవహారాలలో అనవసరమైన జోక్యం. సభ్యతకే విరుద్ధం.

మొదటి ప్రశ్నకు- అందులోనూ ఒక అపరిచితవ్యక్తి అసభ్యతకు- సహృదయంతో సమాధానం చెప్పడం ఎంత కష్టమో, కొన్ని ప్రశ్నలకు వెంట వెంటనే సదుత్తరాలు ఇచ్చి మరొక ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ఉండడం కూడా అంతే కష్టం.

"అయినవరంలో పని వుండి వచ్చాను" అన్నాను ముక్తసరిగా- అతనిని ఇంక వదిలించుకునే ప్రయత్నంలో.

"అలాగాండీ!" అంటూ ఆ వ్యక్తి సంభాషణ ఇంగ్లీషులో సాగించడం ప్రారంభించాడు.

"మీరు సోవియెట్ లిటరేచర్ చదువుతున్నట్లు ఉన్నారే?"

మిత్రునివద్ద తీసుకున్న పుస్తకాలలో మొదట వాల్ పోల్ చదవడం మంచిదా, లేక జార్జి ఎలియట్‌నే చదువుదామా అని లోలోన తర్కించుకుంటున్న నాకు చేతిలో సోవియెట్ లిటరేచర్ ఉన్న సంగతి జ్ఞాపకమే లేదు. పుస్తకాలవైపు దృష్టి సారించాను. సోవియెట్ లిటరేచర్ కూడా ఉంది.

ప్రశ్నల పరంపర పుస్తకాలమీదకు మళ్ళడంతో నా చిరాకు అదృశ్యమైంది. ఈ వ్యక్తి పుస్తకాలరాయుడు కావచ్చు. ఏదైనా పుస్తకం తీసుకుని, పుటలు తిరగేస్తూ కాలాన్ని చంపుదామనుకుంటున్నాడేమో? వచ్చేపొయ్యే వాళ్ళను ప్రశ్నలతో చంపకుండా అడిగి పుస్తకం తీసుకో కూడదా అనుకున్నాను.

'అవు'నని సమాధానం చెప్పాను.

అతని ముఖంలో కొంత తీవ్రభావం గోచరించింది. ప్రశ్నలుకూడా మొదటి లాగా నసగకుండా దృఢమైన స్వరంతో వేయడం ప్రారంభించాడు.

"మీకు సోవియెట్ పుస్తకాలంటే అభిమానం కాబోలు!" అంటూ ఒక చిరునవ్వు విసిరాడు.

ఇది వాస్తవంగా ఉత్సాహం కలిగించే విషయం. సోవియట్ సాహిత్యంలోని కొత్తపోకడలు తెలుసుకోవాలనే

ఆసక్తి నాకు చాల కాలంగా ఉన్నదే. సోవియెట్ సాహిత్యం ద్వారా సోవియెట్ ప్రజల నవసమాజ నిర్మాణ దీక్షను, మానవజాతి శ్రేయస్సుకై అకుంఠితమైన విశ్వాసంతో ఎంతటి కష్టనష్టాలనైనా సహించి వారు చేస్తున్న కృషిని కొంతవరకు అవగతం చేసుకున్నాను.

"అవును, సోవియెట్ పత్రికలు, నవలలు విడవకుండా చదువుతాను." అని చెప్పాను. నిజానికి నేను చదివే ఇతర పుస్తకాలు కూడా లేకపోలేదు.

"ఆంధ్రదేశంలో కమ్యూనిస్టులు ఎక్కువ కాదండీ ?"

సోవియెట్ సాహిత్యానికి ఆంధ్రలో కమ్యూనిస్టులు ఎక్కువ ఉండడానికి సంబంధం లేదు. మానవ మనస్తత్వం విచిత్రమైనది. ఆంధ్రదేశంలో ఎక్కువమంది సోవియెట్ సాహిత్యం చదవాలి. తిరిగి వారిలో ఎక్కువమంది కమ్యూనిస్టులు కావాలి. ఇది ఆంధ్రదేశంలో మాత్రమే ఎందుకు సంభవం కాకాలి ?

అయినా, ఎందుకు ఉద్రేకం తెచ్చుకోవాలి ? అందువల్ల తాపీగా చెప్పాను. "ఆఁ, ఎక్కువే అనుకుంటే ఇబ్బంది ఉండకపోవచ్చు. ప్రజలకు తినడానికి తిండి, కట్టడానికి బట్ట, ఉండడానికి ఇల్లు లేని కటిక దరిద్రకాలం ఉన్నంతవరకు కమ్యూనిస్టులు ఉంటారు."

ఆ వ్యక్తిలో కొంత చలనం కనుపించింది. ప్రాయశః ఈ రకమైన అభిప్రాయం అతనికి కటువుగా తోచి వుండవచ్చు.

చాలమందికి వాస్తవం ఎప్పుడూ కటువుగానే ఉంటుంది. కంగారు పడినట్లు ఉన్నాడు.

"కమ్యూనిస్టులంటే మీ అభిప్రాయ మేమిటండీ?" అని అడిగాడు.

కమ్యూనిస్టులంటే నాకు అభిప్రాయాలు ఎందుకు ఉండాలి? నేనంటే కమ్యూనిస్టుల అభిప్రాయం ఏమిటి? ఈ కమ్యూనిస్టులనే జాతివారికి అసలు నా వంటి వ్యక్తి ఒకడు ఉన్నా డనే సంగతే తెలియకపోవచ్చు. కొందరు వ్యక్తుల ఉనికిని మనం గుర్తించి తీరతాము. కొందరిని గుర్తించి నట్లు కనపడతాము. కాని, మరికొందరు తాము కూడా ప్రపంచంలోనే ఉన్నట్లు దేశం పదే పదే చెప్పుకుంటూ బాధించకపోతే ఇతరులు ఎవరూ గుర్తించలేరు. నేను కూడా అలాంటి వర్గానికి చెందినట్లు నాకు చాల కాలంగా భయం ఉంది.

ఇంతకూ కమ్యూనిస్టుల విషయంలో నాకైతే అభిప్రాయాలు లేకపోలేదు. కాని, వాటికి ఒక నిర్దుష్టమైన స్వరూపం అంటూ ఏమీ లేదు. నేను కమ్యూనిస్టునా? నా సిద్ధాంతాలు ఏమిటి? అని నిత్యమూ తర్కించుకుంటూ ఒక నిర్ణయానికి రాలేక, వచ్చినా గుర్తించడానికి దమ్ములు లేక అయోమయ అగమ్యస్థితిలో పొరాడుతున్న నేను ఇతమిత్థమని నా అభిప్రాయాలను మరొకరికి ఎలా వివరించి చెప్పగలను?

అయినా, ఆ వ్యక్తి కమ్యూనిజమ్ అన్నా, కమ్యూనిస్టులన్నా, సోవియట్ సాహిత్యం అన్నా తగిన శ్రద్ధ చూపు

తున్నాడు. కనుక ఇదేదో తేల్చుకోవడం మంచి దనుకున్నాను.

అదే అభిప్రాయంతో "కమ్యూనిస్టులంటే ఎవరూ? మానవుని పరిస్థితి చక్కపడాలనీ, ఒక మానవుడు మరొక మానవుని భక్షించకుండా వుండే రకమైన సామాజికవ్యవస్థ ఏర్పడాలని మనం అంతా కోరుకొనడంలేదూ? అంతవరకు మీరు, నేనుకూడా కమ్యూనిస్టులమే ఏమో?" అన్నాను.

ఆ వ్యక్తి ఆకస్మికంగా లేచి నిలబడ్డాడు. నా దగ్గరికి వచ్చాడు. నా బల్లమీదనే అంతవరకు దూరంగా కూర్చున్న అతని అనుయాయి, అగస్త్యభ్రాత సదృశుడు నా దగ్గరగా జరిగాడు.

రాకడ చూచాను. అయినా యింకా కొంత మసక మసకగానే ఉంది. జేబులోంచి సిగరెట్టుపెట్టె తీసి అందించాను. అక్కర్లేదన్నాడు. సిగరెట్టు తీసి ముట్టించాను.

ఆ వ్యక్తి నా ముఖందగ్గర తన ముఖంపెట్టి తగ్గు స్థాయిలో "మీరు నల్లగొండ, సూర్యాపేట ఎప్పుడైనా వెళ్ళారా?" అని ప్రశ్నించాడు.

అప్పటికి కొంచెం అర్థమయింది. ఇది పోలీసువారికి సంబంధించిన అపరాధ పరిశోధకపద్ధతి కావచ్చు అనుకున్నాను. ఆంధ్రుడు. చేతిలో సోవియట్ పుస్తకాలు. నీరసంగా, ఎర్రటి కళ్ళతో ఉన్నాడు యువకుడు. చదువుకున్న వాడిలా వున్నాడు. ఇక కమ్యూనిస్టుకాడని ఎలా అనుకోవడం? జీతాలు పుచ్చుకుంటూ ఊరికే కూర్చోవడం న్యాయంకాదు,

కమ్యూనిస్టు అయితే సరేసరి- బహుమానం, ప్రమోషనే కూడా లభించవచ్చు. కాదా, నిర్భాగ్యుడు ఎవరైనా వారికి అవసరంలేదు.

'వెళ్ళలే' దన్నాను సూటిగా చూస్తూ. నిజానికి నల్లగొండ, సూర్యాపేట వెళ్ళలేదు. కాని, హైదరాబాదులో అయిదేళ్లు గడిపాను.

"మీరు పార్టీలో సభ్యులా? చెప్పండి సార్! ఫరవా లేదు" అంటూ, స్వరం మరికొంత తగ్గించి "నేనూ, ఆయనా (నా ప్రక్క కూర్చున్న మహానీయుడు) కూడా పార్టీలో సభ్యులమే!" అన్నాడు.

ఇంకేమి? సరిపోయింది. పోలీసులు తప్ప ఇంత చాక చక్యం ప్రదర్శించేవారు మరొకరు ఉండరు.

'కా'దన్నాను.

"చెప్పండి సార్! మనమంతా ఒకటే-" అని ధైర్యం చెప్పాడు.

ఇంక ఈ వ్యవహారం ఇంతటితో ముగించడం మంచి దనుకున్నాను.

"మీతో రెండు మాటలు చెబుతాను వినండి- మొదటిది- నేను గత మూడేళ్ళుగా మద్రాసులో ఉంటు న్నాను. పత్రికా రచయితగా పొట్టపోసు కుంటున్నాను. ప్రస్తుతం- పత్రికలో పనిచేస్తున్నాను"

"ఇక రెండవది- నాకు ఏ పార్టీతోను సంబంధం లేదు. పార్టీతో సంబంధం ఉండి, నిజంగా అండర్ గ్రౌండ్‌లో ఉన్న ఏ కమ్యూనిస్టుకాని తాను కమ్యూనిస్టుననీ, నల్లగొండ, సూర్యాపేటలనుంచి వచ్చాననీ మీతో కాని, మరెవరితో కాని చెప్పడు. ఇంతకూ మీరు ఎవరో, ఎక్కడ ఉంటున్నారో ఏమి చేస్తున్నారో చెప్పారుకారు. చెబుతారా?" అని అడిగాను కొంచెం కటువుగా.

"మీరు సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారా సార్!" అని కొంచెం తెల్లబోతూ ప్రశ్నించాడా వ్యక్తి.

"అవును, పత్రికలో- మీరు పోలీసులేనా? మీ స్టేషన్ ఇక్కడ? నేనుకూడా వస్తాను. మీ ఆఫీసర్ ఎవరైనా ఉంటే ఒక్కసారి మాట్లాడతాను" అన్నాను.

ఆ ఇద్దరు వెంట వెంటనే ముఖాలు చూసుకున్నారు.

ఆ వ్యక్తి కొంచెం కంగారుపడ్డాడు. "అబ్బే, మేము పోలీసులం కాము. మీ విషయంలో కొంచెం పొరపడ్డాం. క్షమించండి సార్!" అంటూ నెమ్మదిగా వెనక్కు తగ్గి "పోదామా!" అని నా పక్క ఆసామిని తమిళంలో హెచ్చరించాడు.

ఆ ఇరువురు ఇక నా మాట లేపి వినకుండా స్టేషన్ దాటి బయటికి వెళ్ళిపోయారు.

సరిగా గుమ్మంలో వారికి ఎదురుగా వస్తున్న ఒక రైల్వే ఉద్యోగి "గుడ్ నైట్ ఇన్‌స్పెక్టర్!" అని సంబోధించ

డము, ఆ అపరిచిత వ్యక్తి "గుడ్ నైట్!" అని బదులు చెప్ప
డము విన్నాను.

అంతలో బెంగుళూరు పాసెంజరు వస్తూన్న సవ్వడి అయింది. ఆ ఇరువురు పోలీసులు లారీవద్దకు వెడతారో లేదో చూచేభాగ్యం లేకుండా రైలు దగ్గరికి పరుగెత్తుకుని వెళ్ళాను.

ఇంతకీ నే నెవణ్ణి ? ? ?